సెల్‌ఫోన్ ఇవ్వలేదని విద్యార్థిని ఆత్మహత్య

స్ఫూర్తి(ఫైల్)

కౌటాల, ఫిబ్రవరి 9 : సెల్‌ఫోన్ ఇవ్వలేదని ఓ పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో జరిగింది. ప్రగతి కాలనీకి చెందిన బొమ్మకంటి స్ఫూర్తి (16) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. ఎప్పటిలాగే శనివారం పాఠశాలకు వెళ్లిన స్ఫూర్తి తండ్రితో కలిసి ఇంటికి వచ్చింది. సెల్‌ఫోన్‌కు స్టడీ మెటీరియల్ వచ్చిందని, సెల్‌ఫోన్ ఇవ్వాలని తల్లి రమాదేవిని అడిగింది. ఇందుకు గేమ్స్ ఆడుతావ్ సెల్ ఇవ్వనని తల్లి చెప్పింది. అప్పై స్టడీ మెటీరియల్ జిరాక్స్ తీసుకొస్తానంటూ తల్లి బయటకు వెళ్లింది. సెల్‌ఫోన్ ఇవ్వనందుకు మనస్తాపం చెందిన స్ఫూర్తి అదే రోజు రాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఆమె తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు.

విలేకరుల పేరుతో డబ్బులు వసూలు చేసిన వారిపై కేసు

వేమనపల్లి,ఫిబ్రవరి 9 : విలేకరుల ముసుగులో అక్రమ దందాలకు పాల్పడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఆదివారం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గోదావరిఖనికి చెందిన మొగిలి అనిల్, జక్కుల శ్రీధర్ ఇటీవల మండలంలోని సుంపుటంలో ఆరు ఎద్దులను కొనుగోలు చేశారు. ఈ ఎద్దులను విక్రయించేందుకు వాహనంలో ఎద్దులను తీసుకుని ఆదివారం పెద్దపల్లికి వెళ్తుండగా వేమనపల్లిలోని వైన్ షాపు దగ్గర తుంగ రమేశ్, తోడేటి సంతోష్, చొప్పదండి జనార్దన్, మాసాని రమేశ్, తగరం వెంకటేశ్, జీలపల్లి పశం, దొబ్బల విష్ణు వారి వాహనాన్ని అడ్డుకున్నారు. తాము విలేకరులమని అక్రమంగా ఎద్దులను తరలిస్తున్నావని, వాహనాన్ని సీజ్ చేయిస్తామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. భయపడిన ఇద్దరు వారికి కొంత నగదును అందజేశారు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనిల్, శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గతంలో కూడా వీరు విలేకరులమని చెప్పుకుంటూ అక్రమ దందాలకు పాల్పడ్డారని తెలిపారు.

బార్‌లో గొడవ పడిన నలుగురి రిమాండ్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 9 : బెల్లంపల్లిలోని కాల్‌టెక్స్ ఏరియాలో ఓ బార్‌లో జరిగిన గొడవలో దాడికి పాల్పడిన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను టూటౌన్ ఎస్ఐ మహేందర్ తో కలిసి వెల్లడించారు. తాండూర్ మండలానికి చెందిన బండారి వంశీ బార్‌లో మద్యం తాగి అనంతరం ఫుడ్ ఆర్డర్ ఇవ్వగా ఆలస్యం కావడంతో ప్లేట్‌ను ఎత్తివేశాడు. తమను చూసే ప్లేట్‌ను ఎత్తివేశాడని పక్క టేబుల్ వద్ద మద్యం తాగుతున్న పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అల్లి సాగర్, అతని స్నేహితులు ఒక్కసారిగా వంశీపై బీరు సీసాలతో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. దీంతో వంశీకి తలకు, కను బొమ్మలు, కుడి చెంప, పొట్ట భాగంలో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వంశీని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వంశీ ఫిర్యాదు మేరకు అల్లీ సాగర్‌తో పాటు బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లికి చెందిన రత్నం సోమయ్య, అంబేద్కర్‌నగర్‌కు చెందిన మామిడి అన్నమయ్య, మరో వ్యక్తి ఫాషిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు వెల్లడించారు.

పేకాడిన నలుగురిపై కేసు

నెన్నెల, ఫిబ్రవరి 9: మండలంలోని కుష్నపల్లి సమీపంలో పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కుష్నపల్లి గ్రామానికి చెందిన ఎనగంటి సంపత్, గంగిరెడ్డి రమేశ్, రాపల్లి రాజయ్య, బెల్లంపల్లి మధుకర్‌రెడ్డి మండిగ రమేశ్ గ్రామ శివారులోని పత్తి చేనులో పేకా ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి నలుగురి నుంచి రూ. 6వేలు నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నామని మరో వ్యక్తి రమేశ్ పారిపోయాడన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోస్టర్ విడుదల

కాసిపేట, ఫిబ్రవరి 9 : ఈ నెల 14,15,16 తేదీల్లో జరగనున్న ఆదివాసీల ఆరాధ్య దైవం గాంధారి ఖిల్లా మైసమ్మ మహా జాతర పోస్టర్లను కాసిపేట మండలంలోని సోనాపూర్ పంచాయతీలోని నాయకపుగూడలో ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, సోనాపూర్ గ్రామ అధ్యక్షుడు రొడ్డ భీమేశ్, బద్ది సాయికుమార్, కోలకని శేఖర్, ఎదుల రాజు, బక్క శంకర్, కిష్టయ్య, దేవరాజ్, ప్రశాంత్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఢిల్లీకి ధర్నాకు తరలిన ఎల్ఐసీ ఏజెంట్లు

ఢిల్లీకి వెళ్లున్న ఎల్ఐసీ ఏజెంట్లు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 9: ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 11న ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు మంచిర్యాలకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్లు బయలుదేరి వెళ్లారు. ఆదివారం ఉదయం ఎల్ఐసీ ఏజెంట్లు మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరారు. ఈ సందర్భంగా పలువురు ఏజెంట్లు మాట్లాడుతూ బీమా ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని, బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితి పెంపును విరమింపజేసుకోవాలని పార్లమెంటు ఎదుట లక్ష మంది ఏజెంట్లతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఏజెంట్ల ప్రయోజనాలకు భంగం కలిగించే బీమా సుంకం పోర్టబులిటీని రద్దు చేయాలని, ఏజెంట్ల కమిషన్‌ను తగ్గించే ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఏజెంట్ల ప్రయోజనాల రక్షణకోసం సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు. ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన వారిలో ఏవోఐ సంఘం కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజాబాబురెడ్డి, మంచిర్యాల బ్రాంచ్ బాధ్యుడు గంగాధరి తిరుపతి, కటకోజ్వల మహేశ్, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, స్వామి, వేణు, అశోక్, విల్సన్, రాజు, తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

నస్పూర్, ఫిబ్రవరి 9 : మంచిర్యాల జిల్లాలోని పీఆర్టీయూ టీఎస్ భవనంలో సంఘం 55వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ రిటైర్డు సంఘం నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, ప్రధాన కార్యదర్శి బచ్చ మోహన్‌రావు, నాయకులున్నారు.

చెన్నూర్‌లో రక్తదాన శిబిరం

చెన్నూర్, ఫిబ్రవరి 9: చెన్నూర్‌లోని మహంకాళీవాడలో కాళీమాత యూత్ ఆధ్వర్యంలో మిత్రుడు మాదాసు పవన్‌కల్యాణ్ స్మారకార్థం ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది వరకు యువకులు రక్తదానం చేశారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం

కోటపల్లి, ఫిబ్రవరి 9 : కోటపల్లి మండలం ఎదుల్లబందం గ్రామంలో ముత్యాలమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. అమ్మవార్లను గ్రామం నుండి ఊరేగింపుగా తీసుకువచ్చి పారుపల్లి సమీపంలోని గోదావరి నదిలో అభిషేకాలు చేసి ఆలయంలో ప్రతిష్ఠించారు. నేడు బోనాలతో జాతర ముగియనుందని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కన్నెపల్లి, ఫిబ్రవరి 9 : కన్నెపల్లిలోని బస్టాండ్ ఏరియాలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

శిలాజ సంపదను కాపాడాలి

రోడ్డు నిర్మాణానికి ఉపయోగిస్తున్న శిలాజాలను పరిశీలిస్తున్న నాయకులు

వేమనపల్లి, ఫిబ్రవరి 9 : మండలంలోని సుంపుటం శివారు ప్రాంతంలో ప్రవహిస్తున్న ప్రాణహిత నది పరిసరాల్లో కొన్ని వందల సంవత్సరాల క్రితం నుంచి ఉన్న అపురూపమైన శిలాజ సంపదను కొందరు అక్రమంగా మత్తడి వాగు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ పేర్కొన్నారు. ఆదివారం బ్రిడ్జి ఉన్న శిలాజ సంపదను పరిశీలించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ వందల ఏండ్ల నాటి శిలాజ సంపదను పగులగొట్టి అప్రోచ్‌రోడ్డు రివిట్‌మెంట్ కోసం ట్రాక్టర్ల ద్వారా తరలించి నిర్మాణానికి ఉపయోగిస్తున్నారు. అధికారులు స్పందించి అరుదైన శిలాజ సంపదను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, అజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న మాస్టర్ వెంకటేశ్

మందమర్రి, ఫిబ్రవరి 9: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో న్యూడ్రాగన్ కరాటే ఆకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కరాటే టోర్నమెంట్‌లో మందమర్రి పట్టణానికి చెందిన బీఎంఆర్ కరాటే ఆకాడమీ విద్యార్థి జి.సాయి అండర్ 14 కటాస్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నట్లు కరాటే మాస్టర్ కర్ర వెంకటేశ్ తెలిపారు. ఆర్.కతిక్, ఆర్కిష్ల విలూత్న సిల్వర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. బంగారు, వెండి పతకాలను సాధించిన విద్యార్థులను సినీ నటుడు బానుచందర్, బీఎంఆర్ ఆకాడమీ చైర్మన్ సంతోష్, మాస్టర్ వెంకటేశ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలో ప్రతిభ

నిర్వాహకులతో మందమర్రికి చెందిన విజేతలు

మందమర్రి, ఫిబ్రవరి 9: తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శతసహస్ర సూర్య నమస్కారాల పోటీల్లో మందమర్రికి చెందిన యోగా మాస్టర్లు పాల్గొని ప్రతిభ కనబరచి వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇంటర్నేషన్‌లో స్థానం సంపాదించారు. రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీలలో 25 సంవత్సరాలపై కేటగిరీలో ఆయుష్ యోగా మాస్టర్ గోదారి రామ్మోహన్ 333 రౌండ్లు, దుర్గం రజిత 157 రౌండ్లు, 25 సంవత్సరాలలోపు కేటగిరిలో మదర్ థెరిస్సా పాఠశాల విద్యార్థి గోదారి అద్వైత 110 రౌండ్ల సూర్య నమస్కారాలను ప్రదర్శించారు.

క్రికెట్ మ్యాచ్‌లో సర్కిల్ పోలీస్ జట్టు విజయం


పోటీల్లో పాల్గొన్న సర్కిల్ పోలీస్ జట్టు, ప్రెస్ ఆఫీసర్స్ జట్టు

కాసిపేట, ఫిబ్రవరి 9 : కాసిపేటలో ముత్యంపల్లి క్రీడా మైదానంలో ఆదివారం కాసిపేట మండల క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజనల్ 3 ఆధ్వర్యంలో మందమర్రి సర్కిల్ పోలీస్ జట్టు, ప్రెస్ ఆఫీసర్ల జట్టు మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. సర్కిల్ పోలీస్ జట్టుకు కెప్టెన్‌గా మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ప్రెస్ ఆఫీసర్స్ జట్టుకు చెట్టి శ్రీధర్ కెప్టెన్‌గా వ్యవహరించారు. హోరాహోరీగా సాగిన క్రికెట్ మ్యాచ్‌లో మందమర్రి సర్కిల్ పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్, రన్నర్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, పలువురు ఎస్ఐలు, సర్కిల్ పోలీస్ సిబ్బంది, మ్యాచ్ నిర్వాహకులు కమటం తిరుపతి, నామ స్వామి రాజు, కార్యదర్శులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం

మంచిర్యాల (ఏసీసీ), ఫిబ్రవరి 7 : మతిస్థిమితం సరిగ్గా లేని 70 ఏళ్ల వృద్ధురాలు స్థానిక మార్కెట్ ఏరియాలో తిరుగుతుండగా స్థానికులు మంచిర్యాలలోని కల్వరి అనాథాశ్రమంలో ఆదివారం చేర్పించారు. జిల్లా దవాఖానలో చేర్పించారు. మతి స్థిమితం లేని వ్యక్తులు కనిపిస్తే సెల్ నంబర్ 9701973636, 9381018678లో సంప్రదించి సమాచారం అందించాలని అనాథశ్రమం నిర్వాహకుడు కుమార్ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

- బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్
- ముగిసిన కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ టోర్నీ

కాసిపేట : బహుమతులు అందిస్తున్న ఏసీపీ రవి కుమార్

కాసిపేట, ఫిబ్రవరి 9 : శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో జరుగుతున్న కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ టోర్నీ ముగియగా ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్, బ్రేవ్ హార్ట్స్ సోల్జర్స్ జట్ల మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో బ్రేవ్ హార్ట్స్ సోల్జర్స్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్‌కు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.30 వేల నగదుతో పాటు ట్రోఫీలను బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు దేశ భక్తిని కూడా అలవరుస్తుందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలుంటాయన్నారు. యువత సోషల్ మీడియా చూసుకుంటూ సమయం వృథా చేసుకోవద్దన్నారు. గంజాయికి దూరంగా ఉండాలన్నారు. యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, నిర్వాహకులు కమటం తిరుపతి, నామసామి రాజు, అప్పాల శేఖర్, మోటూరి సాయి కుమార్, ఇంగు నారాయణ, దాసరి శంకర్, నస్పూరి నర్సింగ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాదారం వైపు పెద్దపులి

పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కాసిపేట, ఫిబ్రవరి 9 : మండలంలో పది రోజుల పాటు సంచరించి హల్‌చల్ చేసిన పెద్దపులి (బీ1) తన దారి మార్చుకొని మాదారం వైపు వెళ్లింది. వరిపేట శివారులో తిష్ట వేసిన పెద్దపులి బుగ్గగూడెం మీదుగా మాదారం వైపు వెళ్లినట్లు దాని పాదముద్రల ఆధారంగా అధికారులు గుర్తించారు. బుగ్గ ఆలయం ముందు, సమక్క సారలమ్మ గద్దెలు, ప్రధాన రహదారి గుండా పులి సంచరించినట్లు తెలుస్తుంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు నుంచి వచ్చిన పెద్దనపల్లి, కన్నాల, దుబ్బగూడెం, వరిపేట శివారులలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. కన్నాల, వరిపేట శివార్లలో అడవి పందులను వేటాడి హతమార్చింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి కనిపిస్తే సమాచారమివ్వాలని ఫారెస్ట్ అధికారులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా..?

భీమారం, ఫిబ్రవరి 9 : 'మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా.. లేదా ?' అని భీమారంలో ఆదివారం పలు కాలనీల ప్రజలను ఏఈఈ రాజమౌళి అడిగి తెలుసుకున్నారు. అవుడం క్రాస్ రోడ్డు సమీపంలోని నీళ్ల ట్యాంక్‌తో పాటు, క్యాథలిక్ చర్చి సమీపంలో ఉన్న నీళ్ల ట్యాంక్ సంబంధించిన మిషన్ భగీరథతో నీళ్లతో పాటు పలు కాలనీల్లో నీటి సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది భరత్ తదితరులున్నారు.

కొత్తపల్లిలో గ్రామసభ

తాండూర్, ఫిబ్రవరి 9 : మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు గాను మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీలో ఆదివారం ఎంపీవో అనిల్ కుమార్ అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం పరిశీలించారు. గుర్తించిన అంశాలు డీఆర్పీ అభిమన్యు చదివి వినిపించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను సభలో వివరించారు. ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు, టీఏ లు రమేశ్, అరుణ్, ఎఫ్ ఏ విజయ్, మేట్ పెరుగు లింగమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తాండూర్, ఫిబ్రవరి 9 : మార్చి 8న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత డీ రిలే జనరల్ షిఫ్ట్ జట్టు

విజయం సాధించిన ఎస్‌ఆర్‌పీ-3 డీ రిలే జట్టు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 9: సీసీసీ నస్పూర్ నాగార్జునకాలనీలోని సింగరేణి ప్రాణహిత స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో ఎస్‌ఆర్‌పీ-3 గని డీరిలే జట్టు విజయం సాధించింది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్‌ఆర్‌పీ-3 గని ఏ, బీ, సీ, డీ రిలేలతో పాటు ఇంజనీరింగ్ జట్ల మధ్య ఆదివారం ప్రాణహిత స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లు జరిగాయి. ఈ పోటీలను గని యాక్టింగ్ మేనేజర్ మహేందర్ ప్రారంభించారు. సీరిలే, డీరిలే జట్లు ఫైనల్‌కు చేరగా డీరిలే జనరల్ షిఫ్ట్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టును గని మేనేజర్ వెంకట్రావ్, రక్షణాధికారి మహేందర్, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు అభినందించారు. ఈ నెల 10న విజేత జట్టుకు రూ.8116, రన్నర్స్ జట్టుకు రూ.2116 నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను మేనేజర్ చేతుల మీదుగా గనిపైన అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అండర్ మేనేజర్లు అరుణ్‌కుమార్, మధుసూదన్, మల్లికార్జున్, రామకృష్ణ, టీబీజీకేఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, ఏఐటీయుసీ నాయకులు అంబాల రవి, తౌటం మల్లేశ్, బీఎంఎస్ నాయకుడు భీమన్న, ఆయా సంఘాల నాయకులు మురళీచౌదరి, గోపాల్‌రెడ్డి, గని కార్మికు లు పాల్గొనగా, శశిధర్, సంగా వణదీప్, బొమ్మ వెంకటేశ్ ఆర్గనైజర్లుగా, సాయిచరణ్, కిరణ్ ఎంపైర్లుగా వ్యవహరించారు.

డైరెక్టర్లు లేక సింగరేణి గాడితప్పుతున్నది

- పరిపాలనను గాలికి వదిలేశారు
- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9 : సింగరేణిలో నలుగురు డైరెక్టర్లు లేక పరిపాలనా గాడితప్పుతుందని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య ఆరోపించారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో డైరెక్టర్ (పా), డైరెక్టర్ (పీపీ), డైరెక్టర్ (ఆపరేషన్), డైరెక్టర్ (ఫైనాన్స్)లేక సంస్థలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి లేదని తెలిపారు. సీఎండీ బలరామ్, ఈఅండ్‌ఎం డైరెక్టర్ సత్యనారాయణ మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. 43 వేల మంది కార్మికులున్న సంస్థలో ఎంతో కీలకమైన డైరెక్టర్(పా) లేక పోవడం పరిపాలనను గాలికి వదిలినట్లేనని అన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, ప్రభుత్వం చెప్పినట్లు వినేవారినే డైరెక్టర్‌గా నియమిస్తారని తెలుస్తుందని ఆరోపించారు. సంస్థలో ఎన్నడూ ఇంతటి దారుణమైన పరిస్థితులు లేవన్నారు. 8 నెలలుగా డైరెక్టర్ ఆపరేషన్ భర్తీ చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.33 వేల కోట్ల బకాయిలు ఉందన్నారు. సంస్థలో అభివృద్ధి కుంటుపడిందని, నూతన గనులు లేవని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే పరిస్థితి లేదన్నారు. సంస్థలో కనీసం రక్షణ పరికరాలు కొందామన్నా లిక్విడ్ క్యాష్ లేదని తెలిపారు. కార్మికుల వైద్య ఖర్చులు ఇవ్వడం లేదని రెఫరల్ దవాఖానాలు కార్మికులను అడ్మిట్ చేసుకోవడం లేదన్నారు. రూ.300 కోట్లు దవాఖానాలకు బకాయిలున్నారని చెప్పారు. సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టు మిట్టాడుతుందన్నారు. కోలిండియాలో అవినీతి తగ్గిందని, సింగరేణిలో పెరిగిందని ఆరోపించారు. పైరవీకారు సంస్థగా మారిందని ఆరోపించారు. కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 14 సంవత్సరాలుగా కనీస వేతనాలకు నోచుకోని కాంట్రాక్టు కార్మికులకు జీవో 22 ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, కార్మికుల మారుపేర్లు సవరించాలని, కొత్త గనులు ఏర్పాటు చేయాలని, కోయగూడెం, సత్తుపల్లి, తాడిచర్ల ఓసీ 2 సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ వేధింపులు మానుకోవాలని, మైనింగ్ స్టాఫ్ సూపర్‌వైజర్లకు సుటేబుల్ జాబ్ ఇవ్వాలని, నూతన క్వార్టర్ల నిర్మాణానికి బదులుగా కార్మికులకు సొంతింటికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ.33 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి వ్యాప్తంగా సేవ్ సింగరేణి నినాదంతో ఏఐటీయూసీ ఆందోళనలకు సిద్ధమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య, ఏరియా కార్యదర్శులు ప్రసాదరెడ్డి, అఫ్రోజ్‌ఖాన్, నాగభూషణ్, బద్రి బుచ్చయ్య, రాంచందర్, పిట్ కార్యదర్శులు మురళీచౌదరి, సారయ్య, నర్సింగారావు, సంగం సదానందం, నగేశ్, సందీప్, రాజ్‌కుమార్, నవీన్, ఆకుల లక్ష్మణ్, మల్లేశం, నాయకులు వెంకటేశ్, రవి, దేవేందర్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

చింతలమానేపల్లి : బాబాసాగర్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9 : మండలంలోని బాబాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలో 1983-1984లో పదో తరగతి చదివిన విద్యార్థులతో పాటు 40 సంవత్సరాల క్రితం చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నగర స్వామి, మల్లయ్య, మురళీధర్‌రావు, ప్రభాకర్ రావు, హనుమంత రెడ్డి, షఫీ హైమద్, శ్రీనివాస్, పర్శ చంద్రశేఖర్, దుబ్బుల నానయ్య, ఎల్ములే మల్లయ్య, మస్కుర్, డోకె నారాయణ, సత్తుతే తుకారాం, రౌతు చరందాస్, నాందేవ్, దేవాజీ, మోతీరాం, తదితరులున్నారు

రామకృష్ణాపూర్‌లో..

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 9: రామకృష్ణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983-1984లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని క్యాతనపల్లి మున్సిపాలిటీలోని సింగరేణి ఆర్కేసీవోఏ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్, రోజ్ మేరీ, మధురబాయి, మల్లయ్య (పీఈటీ), రామచంద్రర్, పూర్వ విద్యార్థులు దుస్స వెంకటేశ్వర్లు, కట్టా ఈశ్వరాచారి, వంగ రాజేశ్వర్‌రావు, చేతి శ్రీరాములు, చింతల శివప్రసాద్, కరుణశ్రీ, లలిత, ఏలీసామణి, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రి, ఫిబ్రవరి 9: మందమర్రి పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని గురువులను సన్మానించారు. షష్ఠిపూర్తి వేడుకలను పురస్కరించుకుని గురువు సుధాకర్ రావు, రమాదేవి దంపతులను గజమాలతో సత్కరించారు.

రామకృష్ణాపూర్ : 1983-84 బ్యాచ్ జడ్పీ పాఠశాల విద్యార్థులు

మందమర్రి : సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు

సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, ఫిబ్రవరి 9: వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలని కానిస్టేబుళ్లు సుమలత, వినోద, రోషిణి సూచించారు. ఆదివారం వాంకిడి స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను అరికట్టాలి

వాంకిడి, ఫిబ్రవరి 9: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖామన, కనర్‌గాం, వాంకిడి మండల కేంద్రంలో ప్రధాన కూడళ్లలోని పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లను అంటించారు. సోషల్ మీడియా, సెల్‌ఫోన్లకు వచ్చే సందేశాలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయనే ప్రకటనలపైజాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానిత మెస్సెజ్‌లపై క్లిక్ చేయవద్దని, ఎవరికీ ఓటీపీ చెప్పవద్దని తెలిపారు. అత్యవసర సమయాల్లో 1930ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంక్ విరాళం

రెబ్బెన, ఫిబ్రవరి 9: గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వాటర్ ట్యాంక్ విరాళంగా సోదరుడు పల్లె వామన్‌రావుతో కలిసి ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పల్లె రాజేశ్వర్‌రావు తెలిపారు. తన తండ్రి పల్లె సత్యనారాయణ జ్ఞాపకార్థం అందించినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాల వార్షికోత్సవం

నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 9: ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమంలో నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తల్లిదండ్రులున్నారు.

క్రీడలతో స్నేహభావం

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

దహెగాం, ఫిబ్రవరి 9: క్రీడలతో యువకుల్లో స్నేహతత్వం పెరుగుతందని బెజ్జూర్ మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి సుధాకర్‌రావు అన్నారు. హతినిలో యువనాయకుడు శ్యాగం రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ క్రీడా పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. మొదటి స్థానంలో విజేత జట్టుకు రూ 15000తో పాటు జ్ఞాపిక, రెండవ స్థానంలో నిలిచిన వారికి రూ 7000, జ్ఞాపికను అందిస్తామని తెలిపారు. క్రీడా కారులకు జెర్సీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లగ్గాం దామోదర్, నాయకులు కేదారి, దబ్బిడ సత్యనారాయణ, ప్రదీప్, శ్రీకాంత్, రాజాగౌడ్, రవి, సదర్శన్, విజయ్, శ్రీనివాస్, మల్లేశ్, సాయి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అమలు చేయాలి

కౌటాల, ఫిబ్రవరి 9 : రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని సమతా సైనిక్ దళ్ సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ రసాయన శాస్త్ర ఉపన్యాసకులు దిగంబర్ కాంబ్లె భంతే అన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన బౌద్ధ ధమ్మా శిబిరంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపర్చిన రిజర్వేషన్లపై నిరంతరం దాడులు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఉపాధి అవకాశాలపై వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ లక్ష్మీనారాయణ మసాడే, బౌద్ధ మతస్తులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఐక్యత చాటుతున్న బీసీ సంఘం నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9: బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని బీసీ సంఘాల కాగజ్‌నగర్ డివిజన్ నాయకుడు నికోడే రవీందర్, బీసీ సంఘం నాయకులు ఆరోపించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాల భారతి విద్యాలయంలో ఆదివారం బీసీ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పేద బీసీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, బీసీ జనాభాకు తగ్గట్టుగా, క్రిమి లేయర్‌తో సంబంధం లేకుండా ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంచాలని, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన వారు, బీసీలను విస్మరిస్తున్నారని, ఓట్లు మావి సీట్లు అగ్ర కులాలవా ? అని ప్రశ్నించారు. కరీంనగర్ ఎమ్మెల్సీ సీటును కాంగ్రెస్ పార్టీ రెడ్డికి కేటాయించారని అన్నారు. ఇలానే కొనసాగితే, బీసీ నాయకులు సీఎం కావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్న రమేశ్, విద్యార్థి నిరుద్యోగ జేఏసీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కుమారం, జిల్లా నాయకుడు నికోడే అర్జున్, మాలి సంఘం నాయకులు గుళ్లపల్లి నాగేశ్వర్, పద్మశాలీ సంఘం నాయకులు సుంకరి తిరుపతి, మున్నూరి కాపు సంఘం నాయకులు గజ్జల లక్ష్మణ్ మున్నూరు కాపు సంఘం నాయకులు మాచర్ల శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు తదితరులున్నారు.

అదుపు తప్పి ట్రాలీ బోల్తా

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9 : మండలంలోని వీంద్రనగర్ - 1లో పత్తి లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన ఓ రైతు పత్తి విక్రయించేందుకు తీసుకువెళ్తున్న క్రమంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు రైతు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9 : మండలంలోని కర్జెల్లి గ్రామంలో ఆదివారం 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఓ ఇంట్లో అక్రమం గా బియ్యాన్ని నిల్వ ఉంచారన్న పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు. డోకె ఋషి అనే వ్యక్తిపై కేసు నమో దు చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.